క్లుప్తంగా

రైల్వేస్టేషన్‌కు వీల్‌చైర్ అందజేత



తెనాలిటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి ఆధ్వర్యంలో లయన్ టి.ఉదయశంకర్ జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ వెంకట రమణకు వీల్‌చైర్ అందించారు. ప్రయాణికుల సౌకర్యం కొరకు సేవా కార్యక్రమంలో భాగంగా వీల్‌చైర్‌ను అందించినట్లు క్లబ్ అధ్యక్షులు యక్కల రామమోహనరావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి తాళా భక్తుల ఉదయశంకర్, లయన్ అన్నవరపు కనకరత్నం, లయన్ లక్ష్మీ నారాయణ, తెనాలి స్నేహ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



తెనాలిఅర్బన్: చెత్తసేకరణను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మారీసుపేట అప్పలస్వామి గుడి రోడ్డులో మంగళవారం ఉదయం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. చెత్తను మూడు బుట్టల విధానంలో సేకరించాలని సూచించారు. అలాగే వార్డులో జరుగుతున్న మురుగు కాల్వల పూడికతీత పనులు పరిశీలించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, పలువురు శానిటరి ఇన్స్‌పెక్టర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కఠెవరం జెడ్పీహైస్కూల్‌కు బీరువా బహూకరణ



తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న దావులూరి విజయ పాఠశాలకు మంగళవారం బీరువా బహూకరించారు. బీరువా తాళాలను ప్రధానోపాధ్యాయులు తాటి శ్రీధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీధర్ మాట్లాడుతూ అంకితభావంతో, వృత్తిపట్ల నిబద్ధతతో విజయ టీచర్ పని చేశారని తెలిపారు. పాఠశాలకు బీరువా బహూకరించినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఎంజే మహిళా కాలేజ్‌లో క్యాంపస్ డ్రైవ్



తెనాలిటౌన్: పట్టణంలోని జేఎంజే మహిళా కాలేజ్‌లో మంగళవారం మూడో ఏడాది డిగ్రీ విద్యార్థినులకు బెంగళూరుకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ల్యాంగ్వేజ్ మేనేజ్‌మెంట్ వారు క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. అకడమిక్ డైరెక్టర్ రోనిలా కార్లో, హెచ్ఆర్‌లు పాశ, మీరాబిలు మూడు దశల్లో ఇంటర్వ్యూలు చేశారు. ఇంటర్వ్యూల్లో 166 మంది విద్యార్థినులు పాల్గొనగా 24 మంది ఎంపికయ్యారు. కాలేజ్ ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైనీ, కరస్పాండెంట్ రెవరెండ్ డాక్టర్ సిస్టర్ థెరేసమ్మ గాదె, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ శారద, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.సుధాకరయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



గుంటూరు రూరల్: సైబర్ నేరాలు, డిజిటల్ టెక్నాలజీ మోసాలపై విద్యార్థులు, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. ఉమాశంకర్‌రెడ్డి హెచ్చరించారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువయ్యాయన్నారు. అమాయకులను డిజిటల్ టెక్నాలజీతో నేరగాళ్లు మోసం చేయటం జరుగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఈ విషయాలు గమనించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ గేమ్స్‌లో, యాడ్స్ పేరిట జరిగే మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ సిరాజుద్దీన్, డాక్టర్ పీఎల్ మాధవరావు తదితరులున్నారు.

జిల్లా వైద్యశాలలో అత్యాధునిక ల్యాబొరేటరి



పరీక్షల వివరాలు నమోదు చేసుకుంటున్న ఉద్యోగులు



అత్యాధునిక మిషన్‌తో పరీక్షలు చేస్తున్న ఉద్యోగులు



ల్యాబ్‌లో అత్యాధునిక మిషనరీ

- రూ.40 లక్షలతో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్ ఏర్పాటు
- రూ.85 లక్షలతో ల్యాబ్‌కు ఆధునిక పరికరాలు
- త్వరితగతిన పూర్తి అవుతున్న పరీక్షలు

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో అత్యాధునిక ల్యాబొరేటరీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికోసం కేంద్రం రూ.1.25 కోట్ల నిధులను వెచ్చించటంతో పాటు లేటెస్ట్ మిషనరీని సమకూర్చింది. నిర్మాణం పూర్తి చేసుకుని ఇప్పుడిప్పుడే దీని సేవలు ప్రారంభం అవుతున్నాయి.

తెనాలి జిల్లా వైద్యశాలలో అధికారులు గతంలో ఒక ల్యాబొరేటరిని ఏర్పాటు చేశారు. అది చిన్న ల్యాబ్ కావటం వల్ల కేవలం కొన్ని రకాల పరీక్షలు మాత్రమే అక్కడ చేసేవారు. మిగిలిన వాటిని ప్రైవేట్ ల్యాబ్‌లలో చేయించుకోవాల్సి వచ్చేది. ఇలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం తెనాలి జిల్లా వైద్యశాలలోని ల్యాబ్‌ను ఆధునీకరించి ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు ఇటీవల చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా ల్యాబ్‌ను రూ.40లక్షలతో ఆధునీకరించింది. అంతేకాకుండా రూ.85 లక్షలతో రక్త, మూత్ర, క్లై పరీక్షలు చేసేందుకు అవసరమైన లేటెస్ట్ మిషనరీని తెనాలి పంపింది.

ఇటీవల ప్రారంభమైన ల్యాబ్ సేవలు..

జిల్లా వైద్యశాలలోని ల్యాబ్‌ను ఆధునీకరించి ఇటీవలే దానిని వైద్యశాల అధికారులకు అప్పగించారు. దానిలో ఇప్పుడిప్పుడే నూతన ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఆధునీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో తాత్కాలికంగా మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను కిందకు మార్చే పనులు జరుగుతున్నాయి. మరికొన్ని రోజుల్లో పూర్తి స్థాయిలో ఇది అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం అక్కడ పలు పరీక్షలకు నమూనాల సేకరణ, వివరాలు నమోదు, రిపోర్టులు ఇచ్చే కౌంటర్‌లు పనిచేస్తున్నాయి.

పెరిగిన పరీక్షల సంఖ్య..

గతంలో రక్త, మూత్ర, క్లై పరీక్షలు మాత్రమే జిల్లా వైద్యశాలలో చేసేవారు. మిగిలిన వాటిని ప్రైవేట్ ల్యాబొరేటరిలో చేయించుకోవాల్సి వచ్చేది. నేడు తెనాలి జిల్లా వైద్యశాలలో నూతన ల్యాబ్‌ను ఏర్పాటు చేయటం వల్ల దాదాపు అన్ని రకాల పరీక్షలు ఇక్కడే చేయించుకునే అవకాశం ఏర్పడింది. అంతేకాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన అత్యాధునిక పరికరాల వల్ల రిజల్ట్ కూడా అతి తక్కువ సమయంలో లభిస్తోంది. దీనివల్ల రోజుకు 200 మందికి పరీక్షలు చేయగలుగుతున్నారు.



అందుబాటులో ఉన్న పరీక్షల వివరాలు ఇవి..

హిమోగ్లోబిన్, టోటల్ కౌంట్, ఎంసీవీ, ఈసీఆర్, బ్లడ్ షుగర్, బ్లడ్ యూరియా, ఆర్‌హెచ్ టైపింగ్, సీరమ్ క్రియాటిన్, టోటల్ ప్రొటీన్, హెచ్ఐవీ, బెటరాలిజికల్ టెస్ట్ ఫర్ వాటర్, సీరమ్ సోడియం, సీరమ్ పొటాషియం, డెంగీ, యూరిన్ ప్రెగ్నెన్సీ టెస్ట్, మలేరియా, వీడీఆర్ఎల్, ఏఈసీ, టోటల్ కొలస్ట్రాల్ తదితర 80 రకాల పరీక్షలు ఇక్కడ చేయనున్నారు. నూతన ల్యాబ్ ఏర్పాటు వల్ల తెనాలి జిల్లా వైద్యశాలకు వచ్చే రోగులకు దాదాపు అన్ని రకాల పరీక్షలు లభించే అవకాశం ఏర్పడినట్లు అయ్యింది.

విస్తృతమైన ల్యాబ్‌ల సేవలు..



తెనాలి జిల్లా వైద్యశాలలో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దానికోసం రూ.1.25 కోట్ల నిధులను వెచ్చించటంతో పాటు ఆధునిక మిషనరీని తెనాలి పంపారు. దాని ద్వారా మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీకి సంబంధించిన టెస్ట్‌లు చేసే అవకాశం ఏర్పడింది. అలాగే జిల్లా వైద్యశాలలో చేసే పరీక్షల సంఖ్య కూడా పెరిగింది. తెనాలి పరిధిలోని ప్రజలు దీని సేవలను ఉపయోగించుకోండి.

–డాక్టర్ సౌభాగ్యవాణి, సూపరింటెండెంట్, జిల్లా వైద్యశాల, తెనాలి

ల్యాబ్ సేవలు బాగున్నాయి..



తెనాలి జిల్లా వైద్యశాలలో అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు. గతంలో కిడ్నీకి సంబంధించిన పరీక్షలు బయట చేయించుకోవాల్సి వచ్చేది. నేడు జిల్లా వైద్యశాలలోనే వాటిని చేయించుకునే వెసులుబాటు కలిగింది. ప్రభుత్వం పేదలకు అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులోకి తేవటం సంతోషం.

–జి.వరప్రసాదరావు, నారాకోడూరు

రెండో రోజు వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు



పూర్ణాహుతిని జరిపిస్తున్న పండితులు



ప్రవచనం చేస్తున్న త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార్

తెనాలిటౌన్: పట్టణంలోని తాలూకా హైస్కూల్ గ్రౌండ్‌లో శ్రీ విద్యాపీఠం, సాలిగ్రామ మఠం సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవం రెండో రోజు మంగళవారం వైభవంగా జరిగింది. గోవిందనామ జపయజ్ఞ పూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో పండితులు నిర్వహించారు. శ్రీ విద్యాపీఠం నిర్వాహకులు బాలస్వామిజీ పర్యవేక్షణలో ఉదయం శ్రీవారికి సుప్రభాతసేవ, ఊంజల్‌సేవ, తోమాలసేవ, గోమాతకు ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీనివాసునికి విశేషంగా స్వర్ణపుష్పాలతో అర్చన, కొండూరు పద్మావతికి సౌందర్యలహరి, సహస్రగళార్చన 600 మంది మహిళలచే ఆలపించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార్ రామానుజ జీయర్ స్వామి శ్రీనివాసుని దర్శించారు. స్వామివారి విశిష్టతను భక్తులకు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో మఠం ట్రస్ట్ చైర్మన్ సంబూరి కృష్ణమూర్తి, సెక్రటరీ ఉప్పల నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, రామకృష్ణ, రాజేశ్వరరావు, లోకనాథం, నరేంద్రస్వామి, సాలిగ్రామ మఠం, శ్రీ విద్యాపీఠం, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలు అందజేశారు.

గుడివాడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



తెనాలిటౌన్: రూరల్ మండలం గుడివాడ గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాన్ని మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు ప్రారంభించారు. కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు పర్యవేక్షణలో శిబిరం నిర్వహించారు. శిబిరంలో రోగులకు గుండె, రక్త, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. 696 మందికి వైద్య సేవలు అందించారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లను అందజేస్తామని డాక్టర్ సుబ్బారావు తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యడ్లపాటి రాకేష్, పీహెచ్ఏ పద్మశ్రీ, ఎంపీహెచ్ఈవో రాజయ్య, సూపర్‌వైజర్‌లు వెంకటరెడ్డి, ప్రసన్నలక్ష్మి, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోవిడ్ అమర వైద్యులకు నివాళి



తెనాలిరూరల్: కోవిడ్ మహమ్మారి చెలరేగిన సందర్భంలో రోగులకు వైద్య సేవలు అందిస్తూ ప్రాణాలు కోల్పోయిన వైద్యులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు ఘన నివాళి అర్పించారు. ఐఎంఏ తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఇక్కడి బోస్‌రోడ్డు నుంచి గాంధీచౌక్ వరకు మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ తెనాలి అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పూర్తి చికిత్స విధానాలు లేని కరోనా వైరస్‌ను ఎదుర్కోవడంలో అమరులైన వైద్యులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. డాక్టర్లు పావని, కోటినాగయ్య, అనిల్‌కుమార్, శ్యామ్‌ప్రసాద్, మధుప్రభాకర్, సాంబిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి పట్ల అవగాహన ర్యాలీ

వ్యాధి నివారణ పక్షోత్సవ కార్యక్రమం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, బీజేపీ నాయకులు



గ్రైటనాల్టస్‌లో ఫార్మసీ విద్యార్థులు, అసోసియేట్ ప్రొఫెసర్లు

తెనాలిటౌన్: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సంపూర్ణ జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవ కార్యక్రమం మంగళవారం మార్కెట్ సెంటర్‌లో ప్రారంభించారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 14 వరకు జరుపుతున్నట్లు డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్ తెలిపారు. కుష్ఠు వ్యాధి పట్ల అవగాహన కలిగించేందుకు కరపత్రాలు పంపిణీ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. స్పర్శలేని మచ్చలు ఉన్నట్లయితే వైద్య సిబ్బందికి తెలియజేసి ఉచితంగా మందులు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాలలో మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వికసిత్ భారత్ నోడల్ ఆఫీసర్ కంఠమనేని నాగభూషణం, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారుమూరి హెలెన్ నిర్మల, వైద్యాధికారి డాక్టర్ వట్టిప్రోలు మౌనిక కుమారి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు, మహిళా మోర్చా నాయకురాలు ఎం.కనకదుర్గ, హౌసింగ్ ఏఈ పిచ్చయ్య, మెప్మా మేనేజర్ మాధవరావు, సూపర్‌వైజర్ సౌజన్య, అందె బాలచంద్రమౌళి, ప్రసాద్, రవికుమార్, దెబోరా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రైటనాల్టస్‌లో కుష్ఠు వ్యాధిపై అవగాహన

తెనాలి: ప్రపంచ కుష్ఠువ్యాధి దినోత్సవం రోజైన మంగళవారం స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలోని ఐపీఏ ఎస్ఎఫ్ విభాగం, ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు మోరంపూడిలోని గ్రైటనాల్టస్ హాస్పిటల్‌లో కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్ఠు రోగులకు సేవ చేసిన జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని జరుపుకుంటున్నామని, వ్యాధిసోకినా కచ్చితమైన చికిత్సను తీసుకుంటూ అందరిలా సుఖవంతమైన జీవితాన్ని గడపొచ్చని రోగులకు విద్యార్థులు తెలియజేశారు. అక్కడ అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఈ ఏడాది వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ బీట్‌లెప్రసీ నినాదాన్ని ఇచ్చిందన్నారు. అందుకోసం కుష్ఠువ్యాధిని ఎలా జయించాలి? ఇతరులకు సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయా విభాగాల మెంటార్స్ అసోసియేట్ ప్రొఫెసర్లు యేళ్ల ఫణికృష్ణ, కె.కళ్యాణచక్రవర్తి, పి.భార్గవి పర్యవేక్షించారు.

నేడు తుమ్మల వెంకట్రామయ్య సాహితీ పురస్కారం ప్రదానం

- ఆపాత మధురాల కలెక్షన్ కింగ్
- డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి
- వృత్తి మానసిక వైద్యం
- తెలుగు భాషపై తరగని మమకారం
- సమాజసేవపై అనురాగం



డాక్టర్ బాబు

తెనాలి: డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి... తెనాలికి చెందిన ప్రవాస భారతీయుడు. వృత్తి మానసిక వైద్యం. ప్రవృత్తి సమాజసేవ. కమ్మని తెలుగు నుడికారంపై తరగని మమకారం. సంస్కృతి సంప్రదాయాలపై అనురక్తి. తెలుగు సాహిత్యం, కళలు, ఆపాత మధురాలైన సినిమాలన్నా అంతే. దశాబ్దాలుగా సేకరించిన వేలాది కలెక్షన్లు ఇందుకు నిదర్శనం. తన దృష్టికొచ్చిన ప్రతి మంచి పాట, మాట, సినిమాను భావితరాలకోసం పదిలపరచారు. తెలుగు సాహిత్యానికి చేసిన కృషికి గుర్తింపుగా అరసం, గుంటూరు జిల్లా, కళల కాణాచి, తెనాలి సంయుక్తంగా అభ్యుదయ సాహిత్యోద్యమ నిర్మాత తుమ్మల వెంకట్రామయ్య సాహితీ పురస్కారాన్ని బుధవారం తెనాలిలో డాక్టర్ బాబుకు ప్రదానం చేయనున్నారు. సమీప గ్రామం మోపర్రు డాక్టర్ బాబు జన్మస్థలం. స్వాతంత్ర్యయోధుడు వడ్లమూడి గోపాలకృష్ణయ్య, విజయలక్ష్మి దంపతుల రెండో కుమారుడు. పూర్తిపేరు రాజేంద్రప్రసాద్‌బాబు. తండ్రి తెనాలిలో స్థిరపడటంతో ఇక్కడే పెరిగారు. కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీలో వైద్యవిద్య అభ్యసించారు. 1974లో డాక్టర్ సీతారావమ్మతో వివాహమైంది. 1977లో అమెరికా వెళ్లారు. అడల్ట్/ చైల్డ్ సైకియాట్రీ చేశారు. ఫోరెన్సిక్ సైన్స్‌లో ఫెలోషిప్ పూర్తిచేశారు. డెట్రాయిట్‌లో నివాసం ఉంటున్నారు. మానసిక వైద్యుడిగా సేవలను అందిస్తున్నారు. డెట్రాయిట్ తెలుగు అసోసియేషన్‌లో చురుకుగా పాల్గొనే డాక్టర్ బాబు అమెరికాకు వచ్చే తెలుగు ప్రముఖులను ఆదరించేవారు. గుంటూరు ఏసీ కాలేజీలో చదివే రోజుల్లో జంధ్యాల పాపయ్యశాస్త్రి గేయాలు, జమ్మలమడక మాధవరామశర్మ ఉపన్యాసాలు అకట్టుకునేవి...మెడికల్ కాలేజీలో చేరాక బలపడింది' అని డాక్టర్ బాబు గుర్తుచేసుకున్నారు. వైద్య విద్యార్థిగా రాసిన గేయాలు, మిత్రుల గేయాలతో మణిమంజూష, సాహిత్యలహరి, సోనార్ బంగ్లా పేరుతో సంపుటాలుగా తీసుకొచ్చారు. భారత సంప్రదాయాలను భావితరాలకు అందించాలన్న కోరికపై కొన్నేళ్ల క్రితం మన వారసత్వం పుస్తకాన్ని రెండు ఎడిషన్లు తీసుకొచ్చారు. దీనికి తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం లభించింది.క్రమంతప్పక తెనాలి వస్తుండే డాక్టర్ బాబు జన్మస్థలి మోపర్రుతో పాటు, తెనాలి అభివృద్ధిలోనూ పాలుపంచుకున్నారు. తెనాలిలో ఏజీఎస్ఏ నిర్వహించిన వేసవి క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణ వ్యయాన్ని డాక్టర్ బాబు భరించారు.

ట్రాఫిక్ రద్దీ నివారణకు సిగ్నలింగ్ వ్యవస్థ కీలకం

- తెనాలిలో సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు శరవేగంగా అడుగులు
- ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చకచకా ఏర్పాట్లు
- ఆర్ అండ్ బి రోడ్డులో జీబ్రా లైన్స్‌కు పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: దశాబ్దాలుగా పట్టణంలో కొనసాగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించనుంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో కీలకమైన సెంటర్లలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఎంపిక చేసిన కూడలి ప్రదేశాల్లో ట్రాఫింగ్ పోల్స్ ఏర్పాటైన విషయం తెలిసిందే. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చొరవతో ప్రముఖ పారిశ్రామిక సంస్థ కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ సిగ్నల్ లైట్స్ కోసం రూ.30 లక్షలను అందజేసింది. మున్సిపాలిటీ, ఆర్ అండ్ బీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇతర ఏర్పాట్లను చేస్తున్నారు. ఆర్ అండ్ బీ రోడ్డు పరిధిలో జీబ్రా లైన్స్ ఏర్పాటు తప్పనిసరి. దీనిపైనే చర్చించి నిర్ణయం తీసుకునేందుకు మంగళవారం ఎమ్మెల్యే శివకుమార్, సంబంధిత శాఖల అధికారులు ఆయా ప్రదేశాలను సందర్శించారు. తెనాలి విజయవాడ రోడ్డులో పట్టణ పరిధిలోని సాయిబాబా టెంపుల్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ సమీపంలో ఎక్కడెక్కడ జీబ్రా లైన్స్ వేయాలనేది పరిశీలించారు. అనంతరం అధికారులు మార్కెట్ సెంటర్, కబేళా సెంటర్, కొత్త బ్రిడ్జి, చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద జీబ్రా లైన్స్ ఏర్పాటుపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుచేస్తున్న కూడలి ప్రదేశాల్లో ఇప్పటికే పోల్స్ నిర్మించినందున లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని సిగ్నలింగ్ వ్యవస్థను పర్యవేక్షిస్తున్న సునీల్ వెల్లడించారు. ఇప్పటికే అన్ని పనులు త్వరితగతిన జరుగుతున్నాయని, ఫిబ్రవరి పదో తేదీలోగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వీరితో ఆర్‌అండ్‌బీ డీఈఈ నాగేశ్వరరావు, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సుధాకర్, సుబ్బారావు, త్రీటౌన్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

తెనాలి పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక
- అజెండాలోని 33 అంశాలు ఆమోదం



సమావేశంలో చైర్‌పర్సన్ రాధిక



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మానసారెడ్డి

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ రాధిక అధ్యక్షత వహించారు. అజెండా చదవటం ప్రారంభించగానే తన వార్డులో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా జరగటం లేదని, శానిటరి ఇన్‌స్పెక్టర్ అనుపమ పనితీరే దీనికి కారణమని, వెంటనే ఆమెను తన వార్డు నుంచి మార్చివేయాలని 31వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి కోరారు. సమావేశం పూర్తి కాగానే ఆమెను పిలచి మాట్లాడదామని చైర్‌పర్సన్ రాధిక హామీ ఇచ్చారు. అనంతరం అజెండాలోని 33 అంశాలు చదివి ఆమోదించారు. అనంతరం చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ అజెండాలోని అన్ని అంశాలు ఆమోదించామని చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కమిషనర్ ఎం.జశ్వంతరావు, ఎంఈ నాగమల్లేశ్వరరావు, పలువురు కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి



మద్దాళి శేషాచలం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద పార్టీ నేతల నివాళి



ఆర్యవైశ్య యువజన సంఘాల ఆధ్వర్యంలో గాంధీకి నివాళి

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతిని జరిపారు. స్థానిక గాంధీచౌక్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. భారతదేశానికి స్వాతంత్ర్య సాధన కోసం అహింస అనే ఆయుధంతో బాపూజీ చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. భాస్కరుని శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కొల్లా గురునాథగుప్త, చుండూరు సాయి, తట్టుకూళ్ల అశోక్‌యాదవ్, షేక్ మీరావలి, గుగ్గిల రాము, భాస్కరుని లక్ష్మీనారాయణ, ఆతుకూరు పూర్ణచంద్రరావు, పొన్నూరు శ్యామలరావు, సింగిరికొండ ఆంజనేయులు, తిరువిధుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహాత్మా సేవాశాంతి ఆశ్రమంచే...

భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో భాగంగా మహాత్మాగాంధీ గాంధీచౌక్‌లో నిలబడి ప్రజల నుద్దేశించి ప్రసంగించారని, అందుకే ఈ ప్రదేశానికి గాంధీచౌక్‌గా నామకరణం చేయటం జరిగిందని మహాత్మా సేవాశాంతి ఆశ్రమం వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం గాంధీచౌక్‌లోని బాపూజీ విగ్రహానికి గజమాలను సమర్పించి నివాళులర్పించారు. సాయంత్రం బుర్రిపాలెంరోడ్డులోని ఆశ్రమంలో మహాత్మాగాంధీ, కస్తూర్బా విగ్రహాలకు పూజలు నిర్వహించారు. గాంధీజీ ఆచరించిన సత్యం, అహింస, సహాయ నిరాకరణ, మౌనవ్రతం, పాదయాత్ర మొదలైన ఎన్నో శాంతియుత పోరాటాలకు జస్టిస్ చల్లా కొండయ్య లాంటి మేధావులు వేలాది మంది స్ఫూర్తిని పొందినట్లు రామలింగాచారి ఈ సందర్భంగా చెప్పారు. ధర్మకర్తలు, ధర్మదాతల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు సేవలను అందిస్తున్నట్లు తెలిపారు.

ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో..

పట్టణ వాసవి యువజన సంఘం, వాసవి యూత్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీచౌక్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకుడు తుమ్మలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశానికి మహాత్మాగాంధీ చేసిన సేవలు ఎనలేనివని చెప్పారు. ఆదోనిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని అవమానపరచిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు చక్క చెన్నకేశవులు, వెంకట రాజ్‌కుమార్, కొప్పురావూరి హరికిషోర్ పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు జాగ్రత్తలు పాటించాలి



కొల్లిపర: జొన్న, మొక్కజొన్న పంటలకు ఆశించే కత్తెర పురుగు, కాండం తొలుచు పురుగును తొలిదశలోనే గుర్తించి వాటి నివారణలో తగు జాగ్రత్తలు తీసుకున్నప్పుడే వాటి నుంచి పంట నష్టం జరగకుండా తగు దిగుబడులు సాధించవచ్చని జిల్లా లాంఫాం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ జి.వి.ఎన్ ప్రసాదరావు అన్నారు. మంగళవారం మండలంలోని దావులూరు, తూములూరు, అత్తోట గ్రామాల్లోని జొన్న, మొక్కజొన్న పంటలను జిల్లా వనరుల కేంద్రం ఉప వ్యవసాయ సంచాలకులు పి.రామాంజనేయులు, తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకులు ఉషారాణి, మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావుతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతవరణంలో మార్పులు వలన జొన్న, మొక్కజొన్న పంటల్లో కత్తెర పురుగు, కాండం తొలుచు పురుగు ఆశిస్తున్నట్లు తెలిపారు. మొక్కజొన్న విత్తిన 20–25 రోజులకు 15 నుంచి 20 శాతం మొవ్వలు చనిపోయే అవకాశం ఉంది. అందువలన మొక్కజొన్న విత్తిన 10 లేదా 12 రోజులకు విధిగా ఎకరానికి 500 మి.లీ క్లోరిపైరిఫాస్ లేదా 60 మి.లీ క్లోరాంట్రినిలిప్రోలను పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.